# కదిలించే కథ

శంకరంగారికి ఏభై ఎకరాల వన్నెతగ్గని బంగారంలాంటి పొలం ఉందనీ, ఆయన భార్య జానకమ్మగారికి నూరుతులాల కోతకొచ్చిన పొలంలాంటి బంగారం ఉందనీ చూడనివారు చెప్పుకుంటారు. ఇవన్నీ ఉన్నా మానినా వాళ్ళమ్మాయి సీత మాత్రం పదహారోవన్నె బంగారం అని చూసినవారు ఒప్పుకుంటారు.

నాన్న పొలం పనీ, అమ్మ వంటపనీ గమనించడమే పనిగా సీత ఆ పల్లెటూళ్ళో మురిపెంగా ముచ్చటగా ముద్దబంతిలా పెరిగింది. క్రిందికి దువ్విన ఊలుముక్క జడా, చెవులకు బంగారం జూకాలూ, కాళ్ళకు వెండి పట్టీలూ, చేత ముక్కజొన్న గింజలాంటి ఒంటి రంగూ—పిల్లది బొద్దుగా ముద్దుగా తయారయింది. 'చదువుకున్న ఆడాళ్ళు కాపరాలు చేస్తారా?' 'మొగాళ్ళ ఎదురుగుండా నిలబడి మాట్లాడ్డమే. ఒళ్ళు చచ్చిపోదూ?' 'రాత్రిపూట అద్దం చూసుకుంటే వచ్చే జన్మలో భోగంవాళ్ళు అయిపోరూ?' తొమ్మిదేళ్ళకే సీత ఇలాంటి ఆరిందా కబుర్లు నేర్చింది. ఈ భావాలు ఇలా స్థిరపడిపోయేవే. కాని పట్నం నుంచి వాళ్ళ రాధత్త ఓ నాడు ఆఘమేఘాల మీద వచ్చి ఈ బాలమేఘాల్ని చెదరగొట్టింది. రాగానే సీతకు వేసిన పమిటచూసి ఆవిడ ముక్కుమీద వేలేసుకుంది.

'ఏవమ్మా వదినా, పిల్లను తొమ్మిదేళ్ళ దాకా అట్టేపెట్టేరేం? తొమ్మిదో నెలలోనే పమిట వేసెయ్యకపోయారా?...ఇదిగో ముందే చెబుతున్నాను. అంత్యనిష్ఠూరం కన్న ఆదినిష్ఠూరం మేలు. పిల్లదాన్ని ఇలా బుద్ధావతారంలా శుద్ధ మొద్దావతారంలా తయారుచేశారంటె మా వాడికి చస్తే చేసుకోను. ఏరోప్లేను మీద ఏటికెళ్ళి నీళ్ళు తెచ్చుకునే రోజులొస్తూంటే కాలినడకను కలకత్తా బయలుదేరుతారటమ్మా? హవ్వ! ఈ చింతపిక్క

జడేమిటి ? ఈ అగరుచుక్క బొట్టేమిటి ? వాళ్ళకు లేకపోతే నీకేనా లేకపోయిందిటే కోడలా. ముందా జూకాలూ పట్టీలూ పెట్లోపెట్టి వస్తావా, తన్నమన్నావా?' అన్నది.

రాధమ్మ కోడలికి అతి ఆధునికంగా అరగంట ముస్తాబు చేసి రెండు బుగ్గలూ ముద్దెట్టుకుంది. చెరిగిపోయాయనీ, కందిపోయాయనీ నొచ్చుకుని మళ్ళీ పౌడరు వేసింది.

'ఒరే అన్నయ్యా—నీ కూతురు వెయ్యిమందిలో ఎన్నదగిన పిల్ల...ఈ బుగ్గలు ఇంత తెల్లగా ఇంత నున్నగా ఎవర్తికో గాని ఉండవు. పిల్ల ఎలాంటి అల్లరి చేసినా ఈ బుగ్గమీద మాత్రం చెయ్యి వెయ్యనని నాకు మాట ఇయ్యి."

శంకరం అభిమానంగా చెల్లెలివైపు చూశాడు.

'ఆఁ అది నా బుగ్గలు సాగదియ్యకుండా ఉంటేను...నువ్వు అత్తగారిగా దాని బుగ్గలు సాగదియ్యకుండా ఉంటేను !'

జానకమ్మ ఫక్కున నవ్వింది. రాధమ్మ కొడుకును పిల్చింది.

'ఒరే మధూ, ఈసారి నీ పెళ్లాన్ని వచ్చిచూసుకోరా...మంచి ముక్కలా ఉందీ, మల్లెపువ్వులా ఉందీ...'

సీత అత్తను విడిపించుకుని పారిపోయింది.

'మంచి కోతిలాకూడా ఉందే !' అన్నాడు మధు. పెద్దవాళ్ళ హాస్యాలు ఎలా ఉన్నా అత్తమాటలు సీత మనసులో మొదటిసారిగా చాలా ఆశ్చర్యం కలిగించాయి. అంతేకాదు, ఆవేళ మధు సీతసిగ్గు సహం వదలగొట్టి, బలవంతాన కూచోపెట్టి, హైస్కూలు కబుర్లు, ఆటలు, సినిమాలు, పుస్తకాలు గురించి అనేక కబుర్లు చెప్పి ఆ పిల్లలో అనేక ఆలోచనలు రేకెత్తించాడు. ఆడగుంటలతో వామనగుంటలు ఆడడాన్ని మించి చాలా ప్రపంచం ఉందని ఆ పిల్లకు మొదటిసారి తోచింది. అంతేకాదు. ఆపసిపిల్ల హృదయంలో బావ తనకంటె చాలా గొప్పవాడనే భావం స్థిరపడిపోయింది.

బి. యస్సీ ఫస్టుక్లాసులో ప్యాసయిన ఓ వేసవి సెలవుల్లో—అనుకోని సమయంలో—అమ్మా నాన్నా పురాణానికి వెళ్లినవేళలో ఓ చల్లనిరాత్రి నల్లని దొంగలా మధు వచ్చిపడ్డాడు. "ఎవ రీ వస్త్రాదులకు వస్త్రాదు?" అనుకుంది సీత. 'ఎవరీ సౌందర్య పెన్నిధికి ప్రతినిధి?' అనుకున్నాడు మధు.

సీత పూర్వంలా పారిపోకుండా మర్యాదచేసి అన్నానికి లెమ్మనడం మధుకు ఆశ్చర్యం కలిగించింది.

మధు వంటింట్లో భోంచేస్తున్నాడు. సీత వంటింట్లో పొయ్యి పక్కన కూచుంది. 'నెయ్యన్నం అవగానే బావే పిలుస్తాడు' అనుకుంటూ ఏదో ఆలోచనలోపడి పక్కనున్న మసిబొగ్గు తీసింది. గచ్చు నేలమీద నిలువునా పెద్దగీత గీసింది. దాని క్రింద 'బావ, చక్రవర్తి' అని రాసింది. మరో ప్రక్క చిన్నగీత గీసింది. దానిక్రింద 'సీత, చెలికత్తె' అని రాసింది.

మధు నెయ్యన్నం తినేసి కంచంమీద చూపుడు వేలితో ఒక త్రాసు బొమ్మవేశాడు. క్లాసు అమ్మాయిలు మొదలు సినిమా తారల వరకు తనకు నచ్చిన అందగత్తెల పేర్లన్నీ ఒక సిబ్బెలో వ్రాశాడు. ముల్లు మొగ్గు చూపుతున్న రెండవవైపు 'సీత' అని రాశాడు.

ఇద్దరూ ఈ పరిస్థితుల్లో ఉండగా శంకరంగారు, జానకమ్మ వచ్చారు.

మధు కంగారుగా 'పప్పు, పప్పు' అని అరిచాడు!

సీత గుప్పెడు ఉప్పుతెచ్చి కంచం మధ్యగా వడ్డించింది!

* * * *

మరొక మూడురోజులు పోయాక ఓనాటి వెన్నెల రాత్రి సీత నూతి చప్టామీద రెండు బుగ్గలకిందా రెండు చేతులూ కప్పుకొని ఆలోచిస్తూ కూచుంది.

'సీతా' అని మృదుమధురమైన పిలుపు వినిపించింది.

'సన్నని రెండాకుల మధ్య చక్కని పూలచెండు.'

సీత ఒకచెయ్యి తీసేసింది.

'సన్నని కొమ్మచివర చక్కని జామపండు.'

సీత అన్ని వేళ్ళతోనూ మొహాన్ని కప్పేసుకుని లోపల్నుంచి దొంగ తనంగా చూడసాగింది.

'సన్నని వలపెనక చక్కని చేపలు రెండు.'

సీత లేచి పారిపోతూంటే మధు బలవంతాన ఆపేశాడు.

'సీతా, నేను రేపు ఢిల్లీ వెళ్ళిపోతున్నాను. మళ్ళీ ఇప్పట్లో రాను... ఈలోగా నీకు నా హృదయం విప్పి చెప్పాలి...సీతా నా గదిలోకి రా... అడుగడుగునా అందమైన అలంకరణ చూడు. ఒక ఫోటో వంకరగాఉన్నా, ఒక పుస్తకానికి అట్ట చిరిగిపోయినా, ఒకబట్ట ఏమాత్రం నలిగిపోయినా సహించలేనంత సౌందర్యోపాసిని నేను. నా హృదిలోకి రా...ప్రతి నిముషం నా మనసు చేసే సౌందర్యాన్వేషణ తెలుసుకో సీతా! మరకలేని పాలతరకవి. మసకలేని సూర్యకాంతివి. మచ్చలేని చందమామవి. నువ్వు లేకుండా నా బ్రతుకులో అందంలేదు. రా.........నా జీవితంలోకి నడిచిరా...నా వయసుకు సొగసునియ్యి......నా బ్రతుకుకు వెలుగు నియ్యి!'

సీత ఉక్కిరిబిక్కిరైపోయింది, ఉక్కిరి బిక్కిరి అయిపోయింది. ఉబ్బి తబ్బిబ్బయిపోయింది. ఉండలేకపోయిం దక్కడ గదిలోకి పరిగెత్తు కొనివచ్చి తలుపు గడియ వేసుకుని పరుపుమీద వెల్లకిలా పడుకుని కాళ్ళూ చేతులూ కొట్టుకుంది.

*　　*　　*　　*

సీత ఆవేళ ఎందుకనో రోజూకన్న ఎక్కువ ఆనందంగా ఉంది. అనుకున్న దగ్గర్నుంచి ఉత్తరం రాగానే ఆమె పట్టపగ్గాలు లేకుండా

పోయింది. కావలసిన వార్త కనబడగానే ఆమె కాలికి నిలకడలేక పోయింది. మూడేళ్ళ నుంచి ఎదురుచూస్తున్న వార్త అది! ఈలోగా బావ బి. టెక్ ప్యాసయ్యాడు. తను మెట్రిక్ ప్యాసయింది.

'అమ్మా, బావ నెలాఖరికి వస్తున్నాట్టే!' అని సీత వీధిలోంచి ఇంట్లోకి ఒక్క గెంతువేసింది. సరిగ్గా గుమ్మందగ్గర బొటన వ్రేలు చీరకు చుట్టుకుని ఒక ప్రక్కగా పడిపోయింది. ఆ పడడంలో చెయ్యి ముందుఅని గాజులు బ్రద్దలయ్యాయి. గాజు ముక్కలు బుగ్గకు గుచ్చుకుని రక్తప్రవాహాలై పోయాయి. పదిరోజులకు గాని గాయం మానలేదు. ఫలితంగా కుడిబుగ్గమీద కానీ అంత నల్లని మచ్చ మిగిలింది.

అనుకున్న ప్రకారం ఆ తరువాత పది రోజులకు మధు వచ్చాడు. అతనికి సీత కనపడలేదు. జరిగిం దెవరూ చెప్పనూలేదు. ఆనాటి రాత్రి నూతిచప్టామీద సీత వెన్నెలలో రెండు బుగ్గలక్రిందా రెండు చేతులూ కప్పుకుని దీనంగా కూచుంది. 'సీతా' అని పిలుపు వినిపించింది.

మధు వచ్చి సీత పక్కగా కూచున్నాడు.

'సీతా, ఇంజనీరింగులో నాకు ఫస్టుక్లాసు వచ్చింది. దేశంలో ఏమూల ఉద్యోగమైనా మూడొందలు 'స్టార్టింగు' తప్పదు. ఈ మూధమి వెళ్ళాక మా అమ్మ వస్తుందిట. మాట్లాడవేం?'

మధు సీత గడ్డాన్ని పట్టుకుని పైకెత్తాడు. వెన్నెల్లో ఆమెకళ్ళల్లో ఎన్ని కన్నీళ్లో! అంతకన్న ఆమె బుగ్గమీద మచ్చచూసి మధు నోట మాట రాలేదు: బొత్తిగా కళావిహీనమైన మొహంతో తలెత్తి చంద్రుణ్ణిచూశాడు.

తెల్లవారేసరికి మధు లేడు......అతని బదులు అతని పక్కమీద ఒక ఉత్తరం ఉంది. నాలుగే ముక్కలు—

'దేన్నీ అతిగా అభిమానించకూడదు. నాకు బాగా బుద్ధివచ్చింది...ఈ పరిస్థితుల్లో నేను సీతను స్వీకరించలేను. నన్ను క్షమించండి'—

మధుసూధనరావు.

'పనికిమాలిన వెధవ—వీడి బాబులాంటి సంబంధం తీసుకొస్తాను' అన్నాడు శంకరంగారు.

'అయినా అది కావాలని తెచ్చుకుందా ? రేప్పొద్దుట పెళ్ళయాక ఇలాంటిదొస్తే ఏంచేసునో—విడిచిపెట్టేసును కాబోలు—ఇంకా నయం, భగవంతుడు ఇలాగే నా కళ్లు తెరిపించాడు' అంది జానకమ్మ.

సీత చెవులు మూసుకుంది. తల్లితండ్రుల ధోరణి ఆమెకు సుతరామూ నచ్చలేదు. ఆమె వారితో ఎంతమాత్రమూ ఏకీభవించలేక పోయింది.

'బావ రాసిందాంట్లో ఒక్క అక్షరంమ్ముక్క కూడా అసందర్భమేమీలేదు. ఆ పరిస్థితుల్లో ఎవరైనా అలాగే చేస్తారు. చెంపమీద చారెడు మచ్చఉన్న దాన్ని చేసుకోడానికి అతని ఖర్మం ఏంకాలింది ? పనికిమాలినదాన్ని, పాపిష్టిదాన్ని' అని ఆమె అనుకోసాగింది. కావాలని ఏదో నేరంచేసినట్లు ఆమె బాధపడసాగింది. ఈ బెంగతో ఆమె క్షీణించసాగింది శంకరంగారు మొదటి సంబంధంకోసం వెళ్లినరోజునే ఆమె నూతిలో పడబోయి ఆఖరి క్షణాన రక్షించబడింది. దాంతో ఆయన మళ్ళీ ఆ ప్రసక్తి తెస్తే ఒట్టు. పిల్ల మంచాన పడిఉండడం భరించలేక ఆయన పట్నంనుంచి ఫారెన్ డిగ్రీఉన్న డాక్టరు ఒకాయన్ను వెంటబెట్టుకు వచ్చారు. అదృష్టవశాత్తూ వైద్యుడు వెంకట్రావుగారు అనుభవం, నిదానం ఉన్నవారు.

'డాక్టరుగారూ, ఇది నేను చేజేతులా తెచ్చుకున్నది. ఇది రోగంకాదు, దీనికి మందుఉండదు, మీరు వెళ్ళండి.'

ఆయన ఆశ్చర్యంగా చూశాడు.

'అమ్మాయీ, శారీరకంగా నీలో ఏ లోపమూ లేనిమాట నిజమే. నిన్ను బాధిస్తున్నది ఆ మచ్చ ఒకటే ననుకుంటాను, అదే లేకపోతే ?' గోదావరిలో మునిగిపోతున్న గోదాదేవికి పరిపోచ దొరికిందట : నాలుగు

రోజులనుంచి ఒక్క పూటయినా సరిగ్గా భోంచెయ్యని సీత విందుభోజనం చేసినట్టు ఎగిరి గంతేసి లేచి కూచుంది.

'డాక్టరుగారూ, డాక్టరుగారూ, ఇది నిజమేనా? ఈ మచ్చలేకుండా పోతుందా? నా బుగ్గ మామూలుగా తెల్లగా అయిపోతుందా? మీరు ఈ నిర్భాగ్యురాలితో హాస్యమాడడం లేదుగద! నిజం చెప్పండి, త్వరగా చెప్పండి.'

'అంత ఆవేశం పనికిరాదు తల్లీ! అంత ఆశా కూడదు. మన ప్రయత్నం మనం చేదాము. పైన భగవంతుడున్నాడు. నీ బుగ్గమీద మచ్చ ఇంచుమించు శాశ్వతమైనది. ఇలాంటి వాటికి విదేశాల్లో నివారణ ఉంది. ఇప్పుడిప్పుడే ఈ 'ప్లాస్టిక్ సర్జరీ' మనదేశంలో బొంబాయిలోకూడా పెట్టారని విన్నాను. మా క్లాసుమేటు ఒకాయన అక్కడే పనిచేస్తున్నాడు. దీనికి వైద్యం అంటూ ఉంటే అక్కడే జరగాలి.'

'బాబూ ఎంత దూరమైనా సరే, ఎంత ఖర్చయినా సరే మీరు వెనుదియ్యవద్దు. పిల్లదాని మొహంలో ఇన్నాళ్ళకు మళ్ళీ జీవకళ వచ్చినట్టయింది'—

అన్నారు శంకరంగారు పంచకొంగుతో కళ్ళద్దుకుంటూ.

*     *     *     *

అన్నీ అనుకొన్నట్లు సవ్యంగానే జరిగాయి. వెంకట్రావుగారి స్నేహితుడు అప్పుడు బొంబాయిలోనే ఉన్నాడు. అదృష్టవశాత్తూ పెద్ద డాక్టర్ని కలుసుకోడం కూడా అట్టే కష్టమవలేదు. హాస్పిటల్‌లో జాయిన్‌చేసిన మర్నాడే మూడు ఫోటోలు తీశారు ఫోటోలుచూసి పెద్ద డాక్టరు ఆశాభావం వ్యక్తపరిచాడు. మొత్తం రెండు ఆపరేషన్లుచేసి చర్మాన్ని 'గ్రాఫ్టు' చేశారు. కట్టు విప్పిననాడు సీతగుండె దడదడ కొట్టు కుంది అద్దంలో చూసుకోగానే పంజరంలోంచి బయటపడిన పక్షి

ఆనందంతో రెక్కలు కొట్టుకున్నట్టు — ఆమె హృదయం తటతట కొట్టుకుంది. ఆమెకు మానసిక వైద్యుడు అయిన భగవంతుడుగాని, భగవత్స్వరూపుడైన వైద్యుడుగాని ఆ క్షణాన గుర్తుకు రాలేదు! ఆమెకప్పుడు బాప తప్ప మరో ప్రపంచమే ఉన్నట్లు తోచలేదు. పరుగెత్తుకెళ్ళి బాపముందు నిలబడి నడుముమీద చేతులు పెట్టుకుని మళ్ళీ గులాబీ మొగ్గ అయిన తన కుడిబుగ్గ చూపించాలి? ఎనిమిదో రోజున సీతను డిస్చార్జి చేస్తూంటే వెంకట్రావుగారు ఆశ్చర్యంగా చూశారు.

'అదేమిటండీ దీనికి నెలరోజులు పైగా పడుతుందన్నారూ?'

'అవును, అది మామూలు రోగులమాట. ఈ అమ్మాయికి మేము చేసింది ఒకవంతూ, ఆమెకు ఆమె చేసుకున్నది మూడు వంతులూ!'

జానకమ్మ కూతురివైపు చూసింది. ఆ కళ్ళల్లో ఎంతకళ! ఎంత కాంతి! ఆరోగ్యంతో, ఆనందంతో, అన్నిటినీ మించిన ఆశాజ్యోతితో ఆ కళ్ళు మిలమిల మెరిసిపోతున్నాయి. ఆసుపత్రి అనయినా ఆలోచించకుండా జానకమ్మగారు సీతకు మూడుసార్లు దిగదుడిచిపోసింది!

*  *  *  *

'ప్రపంచమంతా ఎదురొచ్చినా సరే నే నిలా సరాసరి బాపదగ్గరకి వెళ్ళవలసిందే!' అంది సీత.

'ఇదేమిటండీ దీని పంతం! రేపు దశమిలోగా కాశీ అన్నపూర్ణకు వడ్డాణం చేయించి ఇస్తానని మొక్కుకున్నానే తల్లి! ఆ తల్లి చలవవల్ల నీ ఒంట్లో కులాసాగా ఉంది. ఇంక ఒక్కరోజే టైము ఉంది. ముందు కాశీకి వెళ్ళి తీరాలి!'

చూస్తూండగా సీతకళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

'ఎలాగండీ దీంతో? నే నొక్కర్తినీ కాశీ ఎలా వెళ్ళను?' అంది జానకమ్మ.

'ఇప్పుడు మధు కలకత్తాలో కదూ ఏదో ప్రైవేటు సంస్థలో జూనియర్ ఇంజనీరుగా ఉంటూంట! కాశీకి వెళ్ళేదారిలోనేగా కలకత్తా ఉంట! వాడికి వైరిచ్చి దీన్నక్కడ దింపేస్తే సరి! మనం వచ్చేటప్పుడు కలకత్తాలో దిగుదాం; ఏమంటావు సీతా ?'

సీత మొహంలో 'వెల వెలల' స్థానే కళ కళలు కనిపించాయి. స్టేషనుకు నౌకరు వచ్చాడు. వాడు బెంగాలీవాడు. 'అందరూ కులాసా' అంటే తెలిసినట్టు తల ఊపాడు. సీతను అక్కడ దింపేసి వాళ్ళు రైలు మారారు.

సీత ఎప్పుడూ లేనంత అందంగా ఉంది. ఎప్పుడూ లేనంత అందంగా ఉంది. 'బావకు ఈమచ్చ పోయిందన్న విషయం ఏ తమాషాచేసి చూపించ గలను ?' ఇదీ ఆమెను పట్టుకున్న సమస్య. టాక్సీ ఆగగానే ఆమె కుడి బుగ్గను రుమాలుతో కప్పుకుని ఇవతలకి ఒక్క గంతేసింది. అత్త వీధి పోర్టికోలో ఉంది. అన్నీ పోగొట్టుకున్నట్టు అతి విచారంగా ఉంది ఆమె మొహం. 'అదేమిటి ?' అని అడిగే వ్యవధికూడా లేకపోయింది సీతకు.

'బావ ఇంట్లో ఉన్నాడా?' అని అతి ఆత్రుతగా అడిగింది.

'ఉష్—గట్టిగా మాట్లాడకు. నీ ఆపరేషనుసంగతి, ఉత్తరం, అన్నయ్య ఇచ్చిన టెలిగ్రాం ఈవేళ ఒక్కసారే అందాయి. వాడికింకా ఇవేమీ తెలీవు. పడుకున్నాడు. మనం మేడమీదికి వెళ్ళిపోదాం రా తల్లీ ?'

సీత అయోమయంగా ఆమెను అనుసరించింది. మేడిమీదికి వస్తూనే రాధమ్మ కుర్చీలో కూలబడి సీతను దగ్గరగా తీసుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

'సీతా, నా చిట్టితల్లీ...నీ కెలా చెప్పనమ్మా ?'

సీతగుండె దడదడ కొట్టుకుంది.

'నా బాబు జీవితం నాశనం అయిపోయింది. నా బ్రతుకే చీకటి అయిపోయింది, ఇక నేను దేన్ని చూసి బతకను? ఎలా బతకను సీతా?'

'ఏం జరిగింది? బావకు ఏం రాలేదుకదా! ఎలా ఉన్నాడు? తొందరగా చెప్పత్తా'

'మధుకు మశూచికం వచ్చింది. రెండుకళ్ళూ పోయాయి!'

సీత బుగ్గమీంచి చెయ్యి జారిపోయింది. చూస్తూండగానే నిరాశా, నిస్పృహా, నిస్సహాయతా చుక్కచుక్కలుగా మారి ఆమె కళ్ళనిండా నిలిచాయి. చెరిగిపోయిన తన మచ్చ ఇంక బావ చూడలేడా? మాసిపోయిన తన మరకను ఇంక బావకు చూపించనేలేదా? అందరిలోనూ అందమైన బావ, అన్నిటిలోనూ ఫస్టుఅయిన బావ పూర్తిగా శాశ్వతంగా గుడ్డివాడు అయిపోయాడా? సీత గబగబ మేడమెట్లు దిగి బావ గదిలోకి పరిగెత్తుకు వచ్చింది. ఆ చప్పుడికి బావ లేచి మంచంమీద కూర్చున్నాడు. సీత అతని కాళ్ళదగ్గర నేలమీద కూర్చుంది. అతని చేతులతో తనమొహం కప్పుకుని వెక్కివెక్కి ఏడ్వ సాగింది. మధు గుడ్డికళ్ళల్లోంచి నిశ్శబ్దంగా హృదయవిదారకంగా కన్నీళ్ళు కాల్వలు కట్టాయి.

'భగవంతుడు నాకు తగినశిక్ష విధించాడు సీతా! పూర్తి అంధకారంతో గాని నాలో అహంకారం పూర్తిగా చావలేదు సీతా! ఇంత అన్యాయంచేసినా నన్ను చూద్దామని వచ్చావా పిచ్చిసీతా!'

సీత కళ్ళెత్తి బావ హృదయంలోకి చూస్తున్నట్టు మాటాడింది.

'లేదు బావా! నిన్ను చూడ్డానికే రాలేదు, నీదగ్గర ఉండిపోదామనే వచ్చాను. దురదృష్టవంతురాల్ని. ఎప్పుడూ ఏ భాగ్యానికీ నోచుకోలేకపోయాను—నీ సేవాభాగ్యమైనా నాకు ప్రసాదించు బావా!'

'అయ్యయ్యో అలాంటి మాటలనకు—అలాంటిభావం నీ మనసులో ఉంటే వెంటనే తుడిచెయ్యి...సువాసనగల సువర్ణ సుందరివి...శరీరంతోపాటు

మనసుగూడా గుడ్డిఅయిన ఈ స్వార్థపరుడితో నీ జీవితం బలిచేసుకుంటావా? చక్కని మొగుణ్ణి చూసుకుని...'

ఇంక సీత మాటాడనియ్యలేదు. మధు ఒక్కడేకాదు. ఆ మర్నాడు వచ్చిన సీత తల్లిదండ్రులు ఈమాట వేయ్యివిధాల చెప్పిచూశారు. అందరి కంటె ఎక్కువగా చెప్పింది రాధమ్మ.

'సీతా' బంగారుతల్లీ! నీకేం పిచ్చి పట్టిందిటే! వాడు నా కొడుకు. నేనే ఇష్టపడంది నీకెందుకే? అరుదైన నీ అందాన్ని ఇంతగా బలిపెడితే మేం చూసి సహించగలమా? నామాట విని తగినసంబంధం చేసుకో సీతా.'

సీతచెప్పిన జవాబుకన్న ఆమె చెప్పిన ధోరణిచూసి ఆమెకు ఎదురు చెప్పడానికి ఎవరూ సాహసించలేదు.

'అత్తా! పుట్టుకతోనే నే నీ ఇంటి కోడల్ని. ఇంకోచోట నాకు చోటులేదు, ఉండదు. నేను ఇక్కడినుంచి కదలను. నన్నెవ్వరూ కదల్చలేరుకూడా బలవంతాన తగిలేస్తే ఇప్పుడే ఈ గుమ్మానికి తల కొట్టుకు చస్తా. మళ్ళీ అలాంటి మాటలాడి నన్ను బాధించవద్దు అత్తా.'

* * * *

'సీతా! ఆనాడు బుగ్గమీద మచ్చ ఉందని నిన్ను తృణీకరించాను. ఈ నాడు నువ్వు నన్ను రెండుకళ్ళూపోయినా స్వీకరించావు. బాహ్య సౌందర్యాన్ని మించిన పరమపావనమైన బ్రహ్మ పరమార్థమేదో ఉందని నా కిప్పుడిప్పుడే అర్థమౌతోంది సీతా! ఇలా దగ్గరగా రా సీతా! నీ కుడి బుగ్గ తడమనీ! ఆనాడు నిన్ను తృణీకరించింది ఈ మచ్చకోసమే కదూ! నా పాపానికి జ్ఞాపక చిహ్నంగా నిలిచిన మచ్చ ఇదేకదూ, సీతా! ఇప్పుడు ఇదే నాకెంతో మధురంగా అనిపిస్తోంది. సీతా! ఏదీ మళ్ళీ మళ్ళీ తడమనీ!' అన్నాడు మధు.

సీతకు జ్ఞానమొచ్చిందగ్గరనుంచీ తనగురించి ఎప్పుడూ ఆలోచించనే లేదు. తను అందగత్తెనని ఎప్పుడూ గుర్తించనేలేదు! తనమట్టుకు తనకు మచ్చఉన్నా లేకపోయినా ఒకటే. తను బొంబాయివెళ్ళి మచ్చ మాన్పు కుంటే అది బావకోసమే. అది బావకు చూపించి మురిసిపోదామని గంపె డాశతో వచ్చింది. బావకు ఆ సంగతి తెలీదు. బావ కళ్ళతో ఆ విషయాన్ని చూడడానికి వీలులేదు. తను తననోటితో ఆ మాట చెప్పడానికి కూడా వీలులేదా! ఇలాంటి ప్రశ్నలకు ప్రపంచంలో ఎవరు జవాబు చెప్పగలరు? హృదయం లేని ప్రకృతి విధించే శిక్షలకు ఎవరు సంజాయిషీ చెప్పగలరు?